
సాక్షి ఒడిశా

శనివారం । 11 । మే । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం శుక్రవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.6,21,755లు, బంగారం 17 గ్రాముల 450 మిల్లీగ్రాములు, వెండి 26 గ్రాముల 100 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



ఖరీఫ్ పనులకు శ్రీకారం

అక్షయ తృతీయ పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా ఖరీఫ్ పనులకు శుక్రవారం నుంచి శ్రీకారం చుట్టారు.

- VIIIలో



216 విదేశీ మద్యం బాటిళ్ల స్వాధీనం

అక్రమంగా తరలిస్తున్న 216 విదేశీ మద్యం బాటిళ్లను ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు.

- VIIIలో

న్యూస్‌రీల్

నిత్యావసర సరుకులు పంపిణీ

రాయగడ: స్థానిక రైతుల కాలనీలోని నవజీవన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుపేద ఆదివాసీలకు నిత్యావసర సరుకులను శుక్రవారం పంపిణీ చేశారు. ట్రస్ట్ నిర్వాహకురాలు ఎం.నళినీ ఆధ్వర్యంలో 35 మందికి బియ్యం, కంది పప్పు, నూనె, బంగాళ దుంపలు వంటి నిత్యావసరాలు పంపిణీ చేశారు. ప్రతినెల తమ ట్రస్టు తరుపున నిరుపేదలకు ఇటువంటి తరహా సేవా కార్యక్రమాలను ట్రస్టు వ్యవస్థాపకుడు డాక్టర్ శ్రీధర్ ఆచార్య నిర్వహిస్తున్నారని ఆమె పేర్కొన్నారు.

గల్లంతైన బాలుడి మృతదేహం లభ్యం



బాలుడి మృతదేహాన్ని బయటకు తీస్తున్న దృశ్యం

జయపురం: లమతాపుట్ సమితి మాచ్‌ఖండ్ నదిలో రెండు రోజుల క్రితం గల్లంతైన మైనర్ బాలుడి మృతదేహం శుక్రవారం లభ్యమైంది. మాచ్‌ఖండ్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది గత రెండు రోజులుగా గాలించి మృతదేహాన్ని కనుగొని బయటకు తీశారు. వివరాల్లోకి వెళ్తే.. లమతాపుట్ సమితి ఖినిముంగ గ్రామంలో నలుగురు బాలురు మాచ్‌ఖండ్ నదిలో స్నానాలు చేసేందుకు వెళ్లారు. వారిలో ఒకరు స్నానం చేస్తూ అకస్మాత్తుగా కాలుజారి నదిలో జారిపడి గల్లంతయ్యాడు. అతడిని రక్షించేందుకు మిగతావారు ప్రయత్నించి విఫలమయ్యారు. ఈ విషయాన్ని గ్రామస్తులకు తెలుపగా గ్రామస్తులు మాచ్‌ఖండ్, నందపూర్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ విషయం తెలిసిన వెంటనే లమతాపుట్ అగ్నిమాపక సిబ్బంది చేరుకొని గాలింపు చర్యలు ప్రారంభించారు. ఎట్టకేలకు మృతదేహాన్ని గాలించి బయటకు తీశారు. అనంతరం పోస్టుమార్టం చేసి అతడి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పోలీసు వర్గాల ద్వారా తెలిసింది.

జగన్నాథ దేవాలయం తలుపులకు వెండి తాపడం

భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథ ఆలయ సింహద్వారానికి వెండి తాపడం ఇటీవల ముగిసింది. త్వరలో మిగిలిన మరో మూడు ప్రధాన ద్వారాల తలుపులకు వెండి తాపడం పనులను చేపట్టనున్నట్లు శ్రీజగన్నాథ ఆలయ నిర్వాహకులు (ఎస్‌జేటీఏ) తెలిపారు. శ్రీమందిరం హస్తి ద్వారం (పశ్చిమ), వ్యాఘ్ర ద్వారం (ఉత్తర) మరియు హస్వ ద్వారం (దక్షిణం) తలుపుల వెండి తాపడం పనులు ప్రారంభించేందుకు కార్యాచరణ సిద్ధమైంది. కొత్త తలుపులు నిర్మించడానికి బర్మీస్ టేకు కలప కొనుగోలు చేస్తారు. ఈ పనుల కోసం రిలయన్స్ గ్రూప్ ఆఫ్ కంపెనీలు వెండి మరియు బర్మా టేకు కలపను విరాళంగా ఇవ్వనున్నాయి. ఆలయం 3 వైపుల భారీ ద్వారాలకు వెండి తాపడం చేసేందుకు దాదాపు 1,500 కిలోల వెండి అవసరమవుతుందని ఎస్‌జేటీఏ తెలిపింది. ఈ ఏడాది రథయాత్రకు ముందే ఈ పనులు పూర్తి చేయాలని నిర్ణయించారు. గతేడాది రథయాత్ర పురస్కరించుకుని గుండిచా ఆలయానికి మూల విరాటులు తరలి వెళ్లిన సందర్భంగా శ్రీమందిరం సింహద్వారం, తలుపులకు వెండి తాపడం పనులు పూర్తి చేశారు. 15 అడుగుల ఎత్తైన సింహద్వారం వెండి తాపడం కోసం ఒక భక్తుడు 525 కిలో గ్రాముల వెండి విరాళంగా ఇచ్చాడు. అంతకుముందు ఎస్‌జేటీఏ 2022 సంవత్సరం మందిరం లోపల బెహరానా, జయ విజయ్, భోగ మండపం, 7 మెట్లు ప్రాంగణం ద్వారాల వద్ద తలుపుల వెండి తాపడం పూర్తి చేసింది.

బీజేడీ మ్యానిఫెస్టో విడుదల

- రాష్ట్ర ప్రజలపై హామీల వర్షం
- యువత భవితకు ప్రత్యేక బడ్జెట్
- 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్
- మహిళా పారిశ్రామికవేత్తలకు రుణాలు



మ్యానిఫెస్టో విడుదల చేస్తున్న సీఎం నవీన్ పట్నాయక్

భువనేశ్వర్:

మరికొన్ని గంటల్లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల కోసం రాష్ట్రంలో బిజూ జనతా దళ్ (బీజేడీ) మ్యానిఫెస్టో విడుదల చేసింది. జాతీయ స్థాయిలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపడమే తమ ప్రధాన లక్ష్యంగా పేర్కొంది. ఆ దిశలో ఈసారి ఎన్నికల మ్యానిఫెస్టో రూపొందించినట్లు సీఎం నవీన్ పట్నాయక్ తెలిపారు. బీజేడీ ఎన్నికల హామీల మ్యానిఫెస్టోను గురువారం రాత్రి వీడియో సందేశం ద్వారం విడుదల చేశారు.

● 24 ఏళ్లలో గుర్తించదగ్గ మార్పులు

బీజేడీ ప్రభుత్వం తన 24 సంవత్సరాల పాలనలో రాష్ట్రంలో గుర్తించదగ్గ మార్పులను తీసుకువచ్చిందని సీఎం నవీన్ పట్నాయక్ అన్నారు. నేటి ఒడిశా ఆధునిక ఒడిశా అన్నారు. అద్భుతమైన సంస్కృతి, సంప్రదాయాలకు నెలవైన రాష్ట్రంగా అభివృద్ధి చెందుతోందని తెలియజేశారు. వరుస ప్రకృతి వైపరీత్యాల కారణంగా దెబ్బతిన్నప్పటికీ, ఒడిశా వెనుకబడిన, పేద రాష్ట్ర స్థితి నుంచి వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా ఉద్భవించిందన్నారు. రాష్ట్రాన్ని స్వర్ణయుగంగా ఆవిష్కరించేందుకు మ్యానిఫెస్టో రూపకల్పన జరిగిందన్నారు. వచ్చే పదేళ్లలో ఒడిశాను దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా మార్చేందుకు రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేశామని చెప్పారు.

● యువతకు వరాలు

రాష్ట్రాభివృద్ధిలో యువత కీలకపాత్ర పోషిస్తారని సీఎం నవీన్ పట్నాయక్ అన్నారు. వారి భవిష్యత్తు కోసం యువ బడ్జెట్ పేరుతో బడ్జెట్ తెస్తామన్నారు. జాతీయ స్థాయిలో ఈ తరహా బడ్జెటు ఇదే మొదటిది అవుతుందని పేర్కొన్నారు. మ్యానిఫెస్టో ప్రకారం రాబోయే 10 సంవత్సరాల్లో యువ బడ్జెట్ కింద ప్రభుత్వం సుమారు రూ.1 లక్ష కోట్లు ఖర్చు చేస్తుందని వెల్లడించారు. బాలికలకు రూ.14,000, అబ్బాయిలకు రూ.12,000 చొప్పున వార్షిక నువాఓ స్కాలర్‌షిప్ బీజేడీ హామీగా పేర్కొంది. దాదాపు 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు రానున్నట్లు పేర్కొన్నారు.

● ఉచిత విద్యుత్

నెలకు 100 యూనిట్ల కంటే తక్కువ వాడే వినియోగదారులకు ఉచిత విద్యుత్ సరఫరా, 150 యూనిట్లు వినియోగించే వారికి 50 యూనిట్లు ఉచితంగా సరఫరా చేస్తామని నవీన్ ప్రకటించారు. రాష్ట్రంలోని దాదాపు 90 శాతం కుటుంబాలు దీని వల్ల ప్రయోజనం పొందుతాయన్నారు. బిజూ స్వాస్థ్య కల్యాణ్ యోజన (బీఎస్‌కేవై) మరింత మంది లబ్ధిదారులకు వర్తిస్తుంది. ఇందులో మధ్య తరగతి, ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు మరియు అట్టడుగు వర్గ సిబ్బందికి లబ్ధి పొందేలా బీమా సౌకర్యం పరిధి విస్తరిస్తారు.

మ్యానిఫెస్టో ప్రధాన అంశాలు

గ్రామీణ ప్రాంతాల్లో అర్హులైన వారందరికీ పక్కా ఇళ్ల కార్యక్రమం కింది రానున్న ఐదేళ్లలో దాదాపు 10 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తవుతాయి. రైతులకు ఉచిత విద్యుత్, రూ.1.5 లక్షల వరకు వడ్డీ లేని పంట రుణం, చేపల వేట నిషేధ కాలంలో మత్స్యకారులకు రూ.15,000 తాత్కాలిక పరిహారం అందుతుంది. ఒడియా భాష ప్రచారం కోసం రూ.100 కోట్ల నిధులు, పశ్చిమ ఒడిశా భాషల ప్రచారం కోసం సంబల్‌పూర్ యూనివర్సిటీలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయబడుతుందని ప్రకటించారు.

మహిళలకు మేలు

రాష్ట్ర అభివృద్ధిలో మహిళలదే ప్రధాన పాత్ర అని పేర్కొన్నారు. వచ్చే ఐదేళ్లలో మహిళా పారిశ్రామికవేత్తలకు రూ.1.5 లక్షల కోట్ల రుణాన్ని అందజేస్తామని బీజేడీ హామీ ఇస్తోందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.2,500 కోట్ల రుణ రాయితీని అందిస్తుందన్నారు. రాబోయే 10 సంవత్సరాల్లో మిషన్ శక్తి సభ్యులకు రూ.50,000 కోట్ల విలువైన ప్రభుత్వ వ్యాపారం అందిస్తుంది. వారికి వడ్డీ లేకుండా రూ.15 లక్షల వరకు రుణ సౌకర్యంతో పింఛన్ ప్రయోజనాలు కల్పించనున్నట్లు ప్రకటించారు. మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు రూ.100 కోట్ల కార్పొరేట్ నిధిని ఏర్పాటు చేస్తామన్నారు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, ఇతర వెనుకబడిన తరగతులకు (ఓబీసీ) చెందిన యువకులు మరియు బాలికలు పారిశ్రామికవేత్తలుగా ముందుకు వచ్చేందుకు ప్రభుత్వం రూ.1,000 కోట్లు వ్యయ ప్రణాళికతో ప్రోత్సహిస్తుందన్నారు. వారికి రూ. 10 లక్షల వరకు పారిశ్రామికవేత్త రుణం ఉచితంగా అందించబడుతుంది.

సిద్ధార్థ్ స్టైలే వేరు



ఈ ఫొటోలో వ్యక్తి సిద్ధార్థ్ రౌత్రాయ్. పూరీ జిల్లా నిమాపడా నియోజకవర్గం నుంచి శాసన సభకు పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి. పూరీ జిల్లా ఎన్నికల కార్యాలయంలో శుక్రవారం నామినేషను దస్తావేజులు దాఖలు చేసేందుకు నిమాపడా నియోజకవర్గం నుంచి ఇలా సైకిల్ తొక్కుతూ వెళ్లి అందరి దృష్టిని ఆకట్టుకున్నారు. పోటీకి తన అభ్యర్థిత్వం ఖరారు అయిన నుంచి నియోజకవర్గంలో పలు పంచాయితీల్లో ఇలా సైకిల్‌పై తిరుగుతు ప్రచారం చేస్తున్నారు. -భువనేశ్వర్

మంత్రి జగన్నాథ సరకకు నిరసన సెగ

● మౌలిక సదుపాయాలు కల్పించలేదని ప్రజల నిలదీత



మంత్రిని ప్రశ్నిస్తున్న మహిళ

రాయగడ: రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరకను కొలనార గ్రామస్తులు నిలదీశారు. తమ గ్రామంలో సమస్యలు విలయ తాండం చేస్తున్న ఇంత వరకు పట్టించుకోలేదని మహిళలు నిప్పుల వర్షం కురిపించారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా బిసంకటక్ శాసనసభ నియోజకవర్గంలో భాగంగా కొలనారలో గురువారం సాయంత్రం ఎన్నికల ప్రచారానికి వెళ్లిన ఆయనను మహిళలు ఘెరావ్ చేశారు. ఎన్నికల సమయంలో దర్శనం ఇస్తున్న మంత్రిపై మండి పడ్డారు. సరైన రహదారి లేక తామంతా ఇబ్బందులు పడుతున్నామని, ఇప్పటికీ మంచినీటి సమస్య వేధిస్తోందని వాపోయారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నియోజకవర్గం నుంచి రెండుసార్లు గెలిచిన మంత్రి ఒక్కసారి కూడా తమ గ్రామానికి రాలేదని స్థానికులు వాపోయారు. సమస్యలను పరిష్కరిస్తానని మంత్రి చెప్పి అక్కడి నుంచి జారుకున్నారు.

ఏనుగు దంతాల అక్రమ రవాణా

● ఇద్దరికి మూడేళ్ల జైలుశిక్ష



ఏనుగు దంతాలతో శంకర్ కొండగిరి



నిందితులను కోర్టుకు తరలిస్తున్న పోలీసులు

రాయగడ: ఏనుగు దంతాల అక్రమ రవాణా వ్యాపారం కేసులో ఇద్దరు నిందితులకు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ పద్మపూర్ జేఎంఎఫ్‌సీ కోర్టు తీర్పునిచ్చింది. జేఎంఎఫ్‌సీ కోర్టు జడ్జి శుభంకర్ మహంతి ఈ మేరకు గురువారం నిందితులను విచారించి తీర్పునిచ్చారు. ఒకొక్కరికీ మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానాను విధించారు. ఒకవేళ జరిమానా చెల్లించని పక్షంలో మరో 6 నెలల పాటు జైలు శిక్ష అనుభవించాలని తన తీర్పులో పేర్కొన్నారు. వివరాల్లోకి వెళ్తే.. గతేడాది మే 23వ తేదీన కెందుగుడ అడవుల్లో ఏనుగు దంతాలను అక్రమంగా విక్రయిస్తున్న కింద్రాగుడ గ్రామానికి చెందిన జాకబ్ మాఝి(35), డెరిగాం గ్రామానికి చెందిన పద్మన కద్రక (55) అనే ఇద్దరు నిందితులను అటవీ శాఖ అధికారులు అరెస్టు చేశారు. వీరి నుంచి రెండు ఏనుగు దంతాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు. ఈ కేసుకు సంబంధించి పద్మపూర్ జేఎంఎఫ్‌సీ కోర్టులో గురువారం విచారణ జరగగా, నిందితులకు మూడేళ్ల జైలు శిక్షను విధిస్తున్నట్లు తీర్పునిచ్చారు.

మరో ఇద్దరు అరెస్టు

ఏనుగు దంతాల అక్రమ రవాణా కేసులో జిల్లాలోని కల్యాణ సింగుపూర్ అటవీ శాఖ సిబ్బంది ఇద్దరిని అరెస్టు చేశారు. అరెస్టైనవారిలో బిసంకటక్ సమితి మునేయిగుడ గ్రామానికి చెందిన శంకర్ కొండగొరి, సురేంద్ర నాహక్‌లు ఉన్నారు. జిల్లా అటవీ శాఖ అధికారి సచిన్ అనాసాహెబ్ ఓహల్ తెలియజేసిన వివరాల ప్రకారం.. కల్యాణ సింగుపూర్ అడవుల్లో ఏనుగు దంతాల అక్రమ రవాణా జరుగుతున్న విషయం తెలుసుకుని అటవీ శాఖ సిబ్బంది గురువారం సాయంత్రం దాడులు నిర్వహించారు. దీనిలో భాగంగా సుమారు 5.20 కిలోల బరువున్న రెండు ఏనుగు దంతాలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.10 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. నిందితుల్లో సురేంద్ర నాహక్ విద్యుత్ శాఖలో పనిచేస్తుండగా, శంకర్ కొండగొరి మసాల దినుసులను విక్రయిస్తుంటాడు. కొద్ది నెలల క్రితం వీరు ఈ వ్యాపారంలో నిమగ్నమై ఉంటున్నారని అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిసింది. అయితే ఈ ఏనుగు దంతాలు ఎక్కడికి రవాణా చేస్తున్నారు. ఎవరి నుంచి వీటిని తీసుకువచ్చారు అన్న విషయాలపై సమగ్ర దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలియజేశారు. నిందితులను కోర్టుకు తరలించారు.

ఎన్‌సీసీ అధికారి లక్ష్మణ పాత్రోకు పదోన్నతి



పదోన్నతి పొందుతున్న లక్ష్మణ్ పాత్రో

జయపురం: స్థానిక విక్రమదేవ్ విశ్వ విద్యాలయంలో ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ లక్ష్మణ పాత్రోకు పదోన్నతి లభించింది. ఆయన ఎన్‌సీసీ కెప్టెన్‌గా పదోన్నతి పొందారు. స్థానిక విశ్వవిద్యాలయ ఓఎస్‌డీ సభాగృహంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఒన్ ఒడిశా ఎన్‌సీసీ కమాండింగ్ అధికారి లెఫ్టినెంట్ కర్నల్ ప్రీతిరంజన్ దాస్, విక్రమదేవ్ విశ్వవిద్యాలయ ఓఎస్‌డీ దేవీ ప్రసాద్ మిశ్రలు కెప్టెన్ లక్ష్మణ పాత్రోకు స్టార్‌లు తగిలించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ రంజన్ ప్రధాన్, జ్ఞానరంజన్ ప్రధాన్, డాక్టర్ సుజిత్ బెహరి, కమలోచన మహాలిక, డా.బి.బి.నంద, డా.ఆర్.కె. సాహు, డా.మనోరంజన్ నాయిక్, సుకాంత సాయ్, పల్లవీ నాయిక్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల బహిష్కరణకు మావోల పిలుపు



ఫుంకాలుగు గ్రామంలో చెట్టుకు అతికించిన మావో పోస్టర్లు



మావో బ్యానర్

రాయగడ: జిల్లాలోని చంద్రపూర్ సమితి ఫుంకాలుగుడ గ్రామంలో గురువారం మావో బ్యానర్లు, పోస్టర్లు కలకలం సృష్టించాయి. ఈనెల 13వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికలను బహిష్కరించాలని మావోలు పిలుపునిచ్చారు. సీపీఐ(ఎంఎల్) బఘునా డివిజన్ పేరిట వెలసిన ఈ పోస్టర్లు, బ్యానర్లలో మావోలు పలు సమస్యలకు సంబంధించి వివరించారు. దేశంలో టాడా, ఉపా వంటి దేశద్రోహ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా విద్య, వైద్యం, వసతి, రహదారులు వంటి మౌలిక సౌకర్యాలను కల్పించలేని నాయకులకు ఓట్లు వేయొద్దని, ఈ ఎన్నికలకు ఎటువంటి మద్దతును తెలపవద్దని ప్రజలను కోరారు. దేశం కార్పొరేటర్ పెత్తందారుల చేతుల్లోకి వెళ్లిపోయిందని, అటువంటి వారికి మద్దతు తెలుపుతున్న పార్టీలకు పాలించే హక్కులేదని వివరించారు. మరో రెండు రోజుల మాత్రమే ఎన్నికలు ఉండటంతో మావో బ్యానర్లు, పోస్టర్లు వెలువడడంతో పోలీసు వర్గాల్లో కలవరం రేపింది. అయితే ఈ ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించే విధంగా తగు చర్యలు తీసుకుంటామని ఇప్పటికే జిల్లా పోలీసు యంత్రాంగం తెలియజేసింది.

నింగిని తాకిన ప్రచార హోరు

బరంపురం:

ఎన్నికల పోలింగ్ గడువు సమీపిస్తోంది. దీంతో అన్ని పార్టీలు ప్రచారాన్ని హోరెత్తిస్తున్నాయి. నింగిని తాకేలా ప్రచారం సాగుతోంది. ఎన్నికల శంఖరావాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ జిల్లా కేంద్రం బరంపురం నగరం నుంచి బుధవారం ప్రారంభించారు. సీఎం నవీన్‌తో పాటు బీజేడీ పార్టీ తరపున పోటీ చేసిన అభ్యర్థులు చంద్ర చావా పట్నాయక్, గోపాల్‌పూర్ నియోజక ఎమ్మెల్యే విక్రామ్ పండా నాయకులు కూడా ప్రచారంలో పాల్గొన్నారు. మరో వైపు జాతీయ కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేస్తున్నా లోక్‌సభ, శాసనసభ అభ్యర్థులు కూడా జోరుగా ప్రచారం చేస్తున్నారు. అలాగే బీజేపీ తరపున పోటీ చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు సైతం ప్రచారంలో దూసుకుపోతున్నారు. వివిధ ప్రచార సభలో బీజేపీ అభ్యర్థుల తరపున ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా పాల్గొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్రంలో అతి పెద్ద జిల్లాగా పేరుగాంచిన గంజాంల్లో సైతం ప్రచారం జోరుగా జరిగింది. ఈ నెల 13వ తేదీన 13 శాసన సభ, రెండు లోకసభ నియోజకవర్గాలకు ఎన్నికలు జరగనున్నాయి.



బరంపురంలో ప్రచారం చేస్తున్న బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ రమేష్ చంద్రచావ్ పట్నాయక్



ప్రచారం చేస్తున్న బీజేపీ అభ్యర్థి కె.అనిల్ కుమార్



ప్రచారంలో నిమగ్నమైన మాజీ మేయర్, స్వతంత్ర అభ్యర్థి శిబ శంకర్ దాస్



గోపాల్‌పూర్‌లో ప్రచారం చేస్తున్న బీజేడీ ఎమ్మెల్యే అభ్యర్థి విక్రామ్ కుమార్ పండా

బరంపురంలో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్



పెద్ద బజార్‌లో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్



వాహనాలను తనిఖీ చేస్తున్న సాయుధ దళాలు



ఫస్ట్‌గేట్ ప్రాంతంలో అర్ధరాత్రి వేళ వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

బరంపురం: సార్వత్రిక ఎన్నికలు మరో 48 గంటల్లో జరగనున్నాయి. దీంతో ఎలాంటి అవాంఛనీయం సంఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా గంజాం జిల్లా బరంపురం నగరంలోని పలు ప్రాంతాల్లో ఎస్పీ సార్థక్ సడంగి ఆదేశంతో రెండు బటాలియన్ పోలీసు బృందాలు శుక్రవారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించాయి. అలాగే నగర ఫస్ట్‌గేట్ ప్రాంతంలో గురువారం అర్ధరాత్రి వరకు వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేశారు. అనుమానం ఉన్న వాహనాలను సమీపంలోని పెద్ద బజార్ పోలీసు స్టేషన్‌కి తరలించారు.

క్లుప్తంగా

ఒక్క అవకాశం ఇవ్వండి

- స్వతంత్ర అభ్యర్థి అమోద్ కుమార్ బర్దన్



మండుటెండలో ప్రసంగిస్తున్న స్వతంత్ర అభ్యర్థి అమోద్ కుమార్ బర్దన్

పర్లాకిమిడి: పర్లాకిమిడి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న విలేకరి అమోద్ కుమార్ బర్దన్ పట్టణంలోని 15వ వార్డులో గల ఖంజావీధి, సవర ఖంజావీధి, పీడబ్ల్యూడీ కాలనీ, గోల్ల వీధిలో శుక్రవారం ఎన్నికల ప్రచారం చేపట్టి తనకు ఓటు వేయాల్సిందిగా కోరుతున్నారు. ఈ ఎన్నికల్లో తనను గెలిపిస్తే పేదల పక్షాన ఉండి వారికి ఆరోగ్యశ్రీ కార్డులు, తాగునీరు, డ్రైనేజీ మరమ్మతులు, రోడ్లు నిర్మిస్తామని చెబుతున్నారు. తన ఎన్నికల గుర్తు పిప్పి (ట్రంపెట్)కి ఓటువేసి గెలిపించాలని ప్రార్థించారు. మరో వైపు పిప్పితో ఊదుతూ వినూత్నంగా అమోద్ ప్రచారం చేస్తూ ఓటర్లను ఆకట్టుకుంటున్నారు.

216 విదేశీ మద్యం బాటిళ్ల స్వాధీనం

- ముగ్గురు అరెస్టు



స్వాధీనం చేసుకున్న విదేశీ మద్యం బాటిళ్ల బాక్సులు

బరంపురం: అక్రమంగా తరలిస్తున్న 216 విదేశీ మద్యం బాటిళ్లను అబ్కారీశాఖ అధికారులు పట్టుకున్నారు. గురువారం రాత్రి బరంపురం-ఛత్రపూర్ మధ్య జాతీయ రహదారి సమీపం నారాయణపూర్ గ్రామంలో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అనుమానాస్పదంగా ఉన్న వ్యాన్‌ను తనిఖీ చేయగా అందులో 216 విదేశీ మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయి. ఈ ఘటనలో వ్యాన్ డ్రైవర్‌తో పాటు ముగ్గురిని చేసినట్టు ఐఐసీ అధికారి కౌసిక్ మజ్జి తెలిపారు. వ్యాన్‌ను సీజ్ చేశామన్నారు. అరెస్టయిన వారిని కారు డ్రైవర్ కాలు సెతి, జితేంద్రకుమార్ మజ్జీ, బాబుని బేహరాలుగా గుర్తించారు. వీరిని కోర్టుకు తరలించామన్నారు.

గుణుపూర్‌లో కాంగ్రెస్ భారీ ర్యాలీ



గుణుపూర్‌లో ర్యాలీ చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ శాసనసభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న సత్యజీత్ గొమాంగోకు మద్దతుగా మున్సిపల్ వైస్ చైర్మన్ శివగాడా నేతృత్వంలో శుక్రవారం గుణుపూర్‌లో భారీ ర్యాలీ చేశారు. మెయిన్‌రోడ్డు మీదుగా విక్రంపురం కూడలి వరకు జరిగిన ర్యాలీలో అధికమంది కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్ధరాత్రి మద్యం డ్రామా

శ్రీకాకుళం క్రైమ్ : గార మండలం దీపావళిలో గురువారం అర్ధరాత్రి మద్యం బాటిళ్లకు సంబంధించి హైడ్రామా నడిచింది. ఒడిశాకు చెందిన మద్యం మండలంలోని కీలక పంచాయతీలకు తెలుగుదేశం అభ్యర్థి తరలించారన్న సమాచారం తెలుసుకున్న శ్రీకాకుళం సెబ్ పోలీసులు ఉదయం పది గంటల నుంచి గార మండలంలో తనిఖీలు చేపట్టా. దీపావళిలోని టీడీపీకి చెందిన ఓ కీలక వ్యక్తి రేకుల షెడ్డు, పురిల్లు (వంటగది)లో భారీ ఎత్తున మద్యం కేసులున్నాయన్న సమాచారం సెబ్ సీఐ గోపాలకృష్ణకు రాత్రి ఎనిమిది గంటలకు వచ్చింది. అయితే పది గంటల వరకు సెబ్ పోలీసులు స్పాట్‌కు వెళ్లకపోవడంపై స్థానికుల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. ఈలోగా సెబ్‌కు చెందిన మరో బృందంలోని సభ్యులు రావడంతో ముందుగా సెంట్రీ కానిస్టేబుల్, మరో పీసీతో కలిసి లొకేషన్‌కు వెళ్లి పావు గంట తర్వాత మిగతా బృందాన్ని పిలిచారు. అప్పటికే డంప్ చేసిన వ్యక్తి కుమారుడు ఫోన్ పట్టుకుని పారిపోవడం, నిమిషాల్లో అక్కడి టీడీపీ సర్పంచ్‌కి ఫోన్‌లో సమాచారం చేరవేయడం..వెనువెంటనే అక్కడికి చేరి పోలీసులతో మాట్లాడటం చకచకా జరిగిపోయాయి. చివరికి అక్కడ ఏమీ లేదంటూ సెబ్ పోలీసులు చేతులెత్తేశారు. దీనిపై స్థానికులు, గార మండల నాయకులు మంత్రి ధర్మాన ప్రసాదరావు దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఈసీకి ఫిర్యాదు చేస్తారని చెప్పడంతో వెనుదిరిగారు.

మెరుగైన వసతులు కల్పించాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్టేట్‌హోమ్‌లో మహిళలకు మంచి వసతులు కల్పించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. కలెక్టర్ కార్యాలయం సమీపంలో స్టేట్‌హోమ్‌ను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేట్‌హోమ్‌లో మహిళలకు సరైన వసతి సౌకర్యాలు అందించాలని, పౌష్టికాహారం, మెరుగైన వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కె.వి.రమణ, స్టేట్ హోం ఆఫీసర్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ పనులకు శ్రీకారం

- వ్యవసాయం పండగ కావాలని పూజలు
- ఘనంగా అక్షయ తృతీయ

భువనేశ్వర్: అక్షయ తృతీయకు రాష్ట్రంలో వ్యవసాయ పండగగా ప్రతీతి. ఈ తిథి పురస్కరించుకుని సాగు పనులకు శ్రీకారం చుట్టడం ఆచారం. పుష్కలమైన పంటలతో రాష్ట్రం తులతూగాలనే ఆకాంక్షతో రాష్ట్ర వ్యవసాయశాఖ అక్షయ తృతీయ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి రైతాంగ సంప్రదాయానికి పట్టం గట్టింది. విభాగం పొలం ప్రాంగణంలో శుక్రవారం అక్షయ తృతీయ పూజలు చేపట్టారు. వ్యవసాయశాఖ ఉన్నత అధికారులు సమూహంగా అక్షయ తృతీయ పూజల్లో ప్రత్యక్షంగా పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా ఏరు పూసి పొలంలో విత్తు జల్లారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ప్రముఖ కార్యదర్శి, డైరెక్టర్ వంటి ఉన్నతాధికారులతో అనుబంధ అధికారులు అంతా పాల్గొన్నారు.

వైభవంగా చందనోత్సవాలు..

బరంపురం: అక్షయ తృతీయ సందర్భంగా నగర శివారులో గల సుకుండా చందన్ పర్వతాలపై ఉన్న లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో చందనోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. నగరం నుంచే కాకుండా జిల్లా చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 5 గంటల సమయంలో లక్ష్మీనృసింహస్వామికి శుప్రభాత సేవతో మేల్కొల్పి ప్రత్యేక తులసి దళాలతో అర్చనలు జరిపారు. మధ్యాహ్నం ఆలయ ప్రంగణంలో భక్తులకు ప్రసాద సేవనం ఏర్పాటు చేశారు.

జగన్నాథ్ ఆలయ ప్రాంగణాల్లో..

బరంపురం: అక్షయ తృతీయ సందర్భంగా స్థానిక గుసానినువాగంలో గల జగన్నాథ్ ఆలయ ప్రాంగణంలో రథయాత్ర కోసం మూడు కొత్త రథాలకు అంకురార్పణ పూజలు చేశారు. నిర్వాహకులు రామ్ చంద్ర పాత్రో పాల్గొని ప్రత్యేక పూజలు చేపట్టారు. కోర్టుపేట, ఉత్కళ ఆశ్రమ రోడ్, ఖస్పావీధి, బాలింకేశ్వర్ పేట, బాపూర్ బజార్, పాతాశేశ్వర్ రోడ్, బెజ్జిపూర్ తదితర జగన్నాథ్ స్వామి ఆలయాల్లో రథయాత్ర కోసం కొత్త రథాలకు పూజలు చేశారు. ఈ కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గంజాంలో ఘనంగా..

బరంపురం: హిందూ సంప్రదాయ ప్రకారం గంజాం జిల్లా వ్యాప్తంగా అక్షయ తృతీయ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఛత్రపూర్ బ్లాక్‌లో జిల్లా పాలన యంత్రంగం ఆధ్వర్యంలో అక్షయ తృతీయ పురస్కరించుకుని ఖరీఫ్ సాగుని ప్రారంభించారు. జిల్లాలో గల పలు బ్లాక్‌ల పరిధిల్లోని గ్రామాల్లో రైతులు ఉదయం పొలంలో హిందు సంప్రదాయం ప్రకారం ఖరీఫ్ పంటల కోసం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నాగలితో భూమిని దున్ని విత్తనాలు చల్లారు.



భువనేశ్వర్: అక్షయ తృతీయ ప్రత్యేక పూజలో పాల్గొన్న వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు

అక్షయ తృతీయ రోజు ఖరీఫ్ సాగు ప్రారంభిస్తే దిగుబడి అధికంగా వస్తుందని రైతుల నమ్మకం. కుకుడాఖండి, రొంగాయిలొండా, చికిటి, సన్నొఖేముండి వివిధ సమితుల్లో ఖరీఫ్ సాగుకు శ్రీకారం చుట్టారు.

పర్లాకిమిడిలో..

పర్లాకిమిడి: అక్షయ తృతీయ సందర్భంగా పట్టణంలో రాజవీధిలోని జగన్నాథ మందిరంలో ఉదయం వచ్చే రథా యాత్ర కోసం తయారుచేసే కొత్త కర్రను శాస్త్రోత్తంగా పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో రథాలు తయారుచేసే శిల్పి సుదర్శన మహారాణా, జగన్నాథ మందిరం పుణరుద్ధరణ కమిటీ అధ్యక్షుడు దుర్గాపాణిగ్రాహి, రథాయాత్ర కమిటీ సభ్యులు బసంత పండా, కుమార్ తదితరులు ఉన్నారు. అనేక మంది భక్తులు శ్రీజగన్నాథ మందిరాన్ని అక్షయ తృతీయ సందర్భంగా దర్శించుకున్నారు.

కాశీనగర్ సమితిలో..

పర్లాకిమిడి: అక్షయ తృతీయ పర్వదినం పురస్కరించుకుని కాశీనగర్ సమితి కె.సీతాపురం పంచాయతీ మిలగాంలో రైతులు పొలాలు దున్ని ఖరీఫ్ పంటకు శుభారంభం పలికారు. తొలుత ఎడ్లుకు పూజలు చేసి, పంట పొలాల్లో భూదేవికి పూజలు చేసి తోలి దుక్కులు దున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కృషక్ మోర్చా అధ్యక్షుడు ప్రశాంత కుమార్ పాలో, రైతులు దేవాది కృష్ణ, దేవాది బాలరాజు, సుధీర్ కుమార్, ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

రాయగడలో..

రాయగడ: జిల్లా వ్యవసాయా శాఖ ఆధ్వర్యంలో కల్యాణ సింగుపూర్ సమితి నారాయణపూర్‌లో గల ప్రభుత్వ అగ్రికల్చర్ ఫార్మ్‌లో అక్షయ తృతీయను పురస్కరించుకుని వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మనోజ్ కుమార్ ప్రధాన్, వాటర్ షెడ్ డీడీఎం దయానిధి బాగ్, ఏడీఓ సుమన్ పట్నాయక్, సీనియర్ సైంటిస్ట్ కె.వి.కె.సుస్మిత తదితరులు పాల్గొన్నారు. ముందుగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం దుక్కుదున్ని వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. అక్షయ తృతీయను పురస్కరించుకుని పట్టణంలో గల బంగారు షాపులు కొనుగోలు దారులతో రద్దీగా కనిపించాయి.



బరంపురం: జగన్నాథ్ రథాల నిర్మాణానికి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం



భువనేశ్వర్: విభాగం పొలంలో ఏరు పూసి విత్తనాలు జల్లుతున్న అధికార సమూహం



బరంపురం: కోర్టుపేటలో ప్రత్యేకపూజలు అందుకుంటున్న జగన్నాథ్ శ్రీమూర్తులు



బరంపురం: సుకుండాలోని లక్ష్మీనృసింహ స్వామి ఆలయం వద్ద పూజలు చేస్తున్న భక్తులు



బరంపురం: ప్రత్యేక పూజలు అందుకుంటున్న లక్ష్మీనృసింహస్వామి



బరంపురం: ప్రత్యేక పుష్పాలంకరణలో లక్ష్మీనృసింహస్వామి



బరంపురం: కోర్టుపేట జగన్నాథ్ ఆలయంలో రథ చక్రాలకు పూజలు చేస్తున్న రామ్ పాత్రో



బరంపురం: దిగపండి బ్లాక్ బంగినబడిలో పూజలు నిర్వహిస్తున్న రైతులు



బరంపురం: దిగపండి బ్లాక్‌లో పొలం దున్నుతున్న ఖరీఫ్ సాగు రైతులు



పర్లాకిమిడి: జగన్నాథ మందిరంలో అక్షయ తృతీయ సందర్భంగా కలపకు పూజలు చేస్తున్న సేవాయత్



పర్లాకిమిడి: మిలగాంలో రైతును సత్కరించిన జిల్లా కృషక్ మోర్చా అధ్యక్షుడు ప్రశాంత్ పాలో



పర్లాకిమిడి: శ్రీజగన్నాథ, బలరామ, సుభద్ర



పర్లాకిమిడి: రథాల కొత్త కలపకు పూజలు



పర్లాకిమిడి: అక్షయ తృతీయ సందర్భంగా దుక్కిదున్నుతున్న ప్రశాంత్ పాలో



పర్లాకిమిడి: అక్షయ తృతీయ సందర్భంగా దుక్కిలు దున్నుతున్న ప్రశాంత్ పాలో

ప్రజా సమస్యలు పరిష్కరిస్తా



ప్రచారంలో మురళీకృష్ణ



మునిసింగి గ్రామంలో మురళీకృష్ణను ఆశీర్వదిస్తున్న మహిళ

పర్లాకిమిడి: తనను గెలిపిస్తే అన్ని సమస్యలు పరిష్కరిస్తానని పర్లాకిమిడి అసెంబ్లీ నియోజికవర్గం నుంచి ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పైల మురళీక్రిష్ణ గమ్మా అన్నారు. పర్లాకిమిడి, కాశీనగర్‌లో శుక్రవారం ఆటోలో ప్రచారం చేస్తూ ఆకట్టుకున్నారు. తొలినుంచి వామపక్షాలు, ట్రేడ్ యూనియన్ల నాయకుడుగా పేరుపొందిన పైల మురళీకృష్ణ ఆటో డ్రైవరు. పేద కుటుంబం నుంచి వచ్చిన ఆయనకు రాష్ట్ర ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ సాధారణ కార్యదర్శి జ్యోతి రంజన్ మహాపాత్రో గజపతి జిల్లా పర్లాఖెముండి నియోజికవర్గం నుంచి పోటీ చేయమని ప్రోత్సాహించారు.

కూర్మనాథుని కల్యాణానికి పందిరిరాట



పందిరి రాట వేస్తున్న దృశ్యం

గార: మండలంలోని శ్రీకూర్మంలో కూర్మనాథుని కల్యాణోత్సవానికి శుక్రవారం పందిరాట వేశారు. శుద్ధ తదియ సందర్భంగా ప్రధాన ఆలయం వద్ద ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు ఆధ్వ ర్యంలో శాస్త్రోక్తంగా జరిపించారు. ఈ నెల 19న వైశాఖ ఏకాదశి పర్వదినం నాడు స్వామి కల్యాణోత్సవం జరగనుంది. ఉదయం విశ్వక్షేన పూజ వంటి వైదిక క్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానాచార్యులు శ్రీభాష్యం పద్మనాభాచార్యులు, లక్ష్మణాచార్యులు, కిషోర్‌బాబు, దాసుబాబు, శ్రీమన్నారాయణ, భక్తులు పాల్గొన్నారు.

టికిరిలో బీజేడీ ర్యాలీ



ర్యాలీలో నెక్కంటి, అనసూయా తదితరులు



ర్యాలీలో పాల్గొన్న జనం

రాయగడ: సార్వత్రిక ఎన్నిక ప్రచారానికి ఒక్కరోజే గడువు ఉండడంతో ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు ఎన్నికల ప్రచారంలో పూర్తిగా నిమగ్నమయ్యారు. ఈ నేపథ్యంలో రాయగడ శాసనసభ స్థానానికి బీజేడీ పార్టీ తరఫున పోటీ చేస్తున్న అనసూయా మాఝిని గెలిపించి తన సత్తాను చాటుకునేందుకు జిల్లా బిజేడి అధ్యక్షులు నెక్కంటి భాస్కరరావు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా నియోజకవర్గం పరిధిలోని కాశీపూర్ సమితి టికిరిలో శుక్రవారం భారీ ర్యాలీని నిర్వహించారు. సమితి అధ్యక్షులు కొంతొమాఝి, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, బీజేడీ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు జగదీష్ పాత్రో తదితరులు పాల్గొన్న ఈ ర్యాలీలో అధికసంఖ్యలో కార్యకర్తలు, పార్టీ అభిమానులు పాల్గొన్నారు. 2019లో జరిగిన ఎన్నికల్లో ఇక్కడ బీజేడీ అభ్యర్థి ఓటమి చెందారు. దీంతో ఈసారి ఎలాగైన ఇక్కడ పాగా వేయాలని బీజేడీ నాయకులు కృషి చేస్తున్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి బిజయ పట్నాయక్ జోరుగా ప్రచారం



తెలుగు సొండివీధిలో ప్రచారం చేస్తున్న బిజయ పట్నాయక్



పెద్ద బ్రాహ్మణ వీధిలో ఇంటింటా ప్రచారంలో కాంగ్రెస్ శ్రేణులు



మాజీ ఎమ్మెల్యే త్రినాథ సాహు స్మృతి చిహ్నం నుంచి ర్యాలీ ప్రారంభించిన బిజయ పట్నాయక్

పర్లాకిమిడి: ఎన్నికల ప్రచారం అంతిమ దశకు చేరుకోవడంతో కాంగ్రెస్ పార్టీ పర్లాకిమిడి నియోజికవర్గం అభ్యర్థి బిజయ కుమార్ పటా్నయక్ ప్రచారాన్ని ముమ్మరం చేశార. కాంగ్రెస్ భవన్ నుంచి పెద్ద బ్రాహ్మణ మీదుగా మార్కెట్ వరకూ శుక్రవారం భారీ ర్యాలీ చేపట్టారు. ఆయనతో పాటు మహిళా కార్యకర్తలు జాస్మిన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బసంత పండా, మాజీ కౌన్సిలరు అభిమన్యు పండా, సంగ్రాం సాహు, సంజయ్ అధికారి ఉన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని బిజయకుమార్ పటా్నయక్ అన్నారు.

ఓట్లను అభ్యర్థిస్తున్న అభ్యర్థులు



ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి తారాప్రసాద్ బాహిణీపతి



ప్రచార సభలో బీజేడీ అభ్యర్థి డాక్టర్ ఇందిరా నందో తదితరులు

జయపురం:

జయపురంలో ఎన్నికల ప్రచారం జోరుగా జరుగుతుంది. మూడు ప్రధాన పార్టీలు సభలు, ర్యాలీలు, ఇంటింటా ప్రచారాలు నిర్వహిస్తున్నారు. ప్రతి వీధిలో ఆయా పార్టీల కార్యకర్తలు పర్యటిస్తూ ఓట్లను అభ్యర్థిస్తున్నారు. ప్రచార హోరుతో పట్టణం హోరెత్తున్నది.



ప్రచారంలో బీజేపీ అభ్యర్థి గౌతమ్ సామంతరాయ్

క్లుప్తంగా

శ్రీరాముడు దర్శప్రాయుడు..



ఆధ్యాత్మిక ప్రవచనం అందజేస్తున్న చినజియర్ స్వామి

విజయనగరం టౌన్: శ్రీరామచంద్రమూర్తి ఎప్పటికీ ఆదర్శప్రాయుడని చినజియర్‌స్వామి అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డులో ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీరామ మహా సామ్రాజ్య పట్టాభిషేకం కార్యక్రమం కొద్ది రోజులుగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, మానవ రూపంలో పుట్టిన భగవంతుడు శ్రీరాముడని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గుణగణాలను వివరించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు పిళ్లా విజయ కుమార్, చెరుకూరి శ్రీధర్, రుత్విక్కులు, వేదపండితులు, భక్తులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలు బంద్

విజయనగరం క్రైమ్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 11వ తేదీ సాయంత్రం ఆరు గంటల నుంచి 13వ తేదీ పోలింగ్ ముగిసే వరకు జిల్లా పరిధిలో ఉన్న 149 ప్రభుత్వ మద్యం దుకాణాలు, 28 రెస్టారెంట్లు, బార్లు, 92 కల్లు దుకాణాలు, రెండు మెథనాల్ యూనిట్స్, ఒక డినేచర్డ్ ఇథనాల్ యూనిట్, 16 డినేచర్డ్ స్పిరిట్, ఆరు మొలాసిస్ యూనిట్లను కలెక్టర్ ఆదేశాల మేరకు మూసి వేస్తున్నట్లు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి ఎన్‌వీ రమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా నిర్వహించేందుకు ఎవ్వరూ మద్యం తాగడం గాని, విక్రయించడం గాని చేయరాదని పేర్కొన్నారు.

పైడితల్లి ఆలయంలో ఊయల



ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఊయల

విజయనగరం టౌన్: భక్తులందరూ తమ పిల్లలను అమ్మవారి పాదాల చెంత ఉంచి ఆశీర్వాదం తీసుకోవడం పరిపాటి. ఈ క్రమంలో పైడితల్లి ఆలయంలో చిన్నారుల కోసం శుక్రవారం ఊయల ఏర్పాటు చేశారు. డాక్టర్ హరి జగన్ ఊయలను ఈఓ డీవీవీ ప్రసాదరావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ, భక్తులు తమ చిన్నారులను అమ్మ సన్నిధానంలో ఊయలలో వేసి ఆశీర్వాదం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అర్చకులు తాళ్లపూడి ధనుంజయ్, ఏడిద వెంకటరమణ, మాజీ అర్చకుడు దూసి కృష్ణమూర్తి, మాజీ సిబ్బంది అప్పలనాయుడు, ఆర్.సూర్యపాత్రో, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

సీతంపేటలో ఈదురు గాలులు, భారీవర్షం



సీతంపేటలో కురుస్తున్న వర్షం

సీతంపేట: మండల కేంద్రం సీతంపేటలో శుక్రవారం ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. అధిక ఉష్ణోగ్రతలతో అల్లాడుతున్న ప్రజలకు ఉపశమనం కలిగింది. వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. కాగా జీడిమామిడి పంటలకు కాస్త నష్టం వాటిల్లిందని గిరిజన రైతులు తెలిపారు.

ఆరోగ్యశ్రీతో పునర్జన్మ..

- గుండె రోగులకు అండగా నిలుస్తున్న పథకం
- ఏటా వేలాది మందికి శస్త్రచికిత్సలు
- ఐదేళ్లలో 2.56 లక్షల మందికి ఆపరేషన్లు
- ఇంతవరకు చేసిన ఖర్చు రూ.537.01 కోట్లు
- జిల్లాలో 33 ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు

విజయనగరం ఫోర్ట్: ఆరోగ్యశ్రీ పథకం అభాగ్యులకు అండగా నిలుస్తోంది. ఎంతోమందికి పునర్జన్మ ప్రసాదిస్తోంది. ముఖ్యంగా నిరుపేద, మధ్య తరగతి ప్రజలకు ఈ పథకం సంజీవినిలా పని చేస్తోంది. వైద్యం ఖర్చు వెయ్యి రూపాయలు దాటితే ఆరోగ్యశ్రీ పథకం వర్తింపజేస్తుండడంతో లక్షలాది మంది పేదలకు ఊరట లభిస్తోంది. గుండె, క్యాన్సర్ వంటి జబ్బుల బారిన పడినవారు చికిత్స చేయించుకోవాలంటే లక్షలాది రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితులుండేవి. ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స అంటే ఇక ఆస్తులు అమ్ముకోవాల్సిందే. ఇటువంటి పరిస్థితులో వారి పాలిట ఆరోగ్యశ్రీ వరంగా మారింది. దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి ఈ పథకం ప్రవేశపెట్టగా.. ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పరిధిని 25 లక్షల రూపాయలకు పెంచారు. ఆరోగ్యశ్రీకార్డు ఉంటే కార్పొరేట్ ఆస్పత్రుల్లో సైతం వైద్య సేవలు పొందవచ్చు. లక్షల రూపాయల విలువైన ఆపరేషన్లే కాదు డెంగీ, మలేరియా వంటి వ్యాధులకు సైతం ఆరోగ్యశ్రీలో చికిత్స అందిస్తున్నారు.



☛ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు సిగడపు విజయలక్ష్మి. ఈమెది సాలూరు గ్రామం. ఓ రోజు ఆయాసంగా ఉందని చెప్పడంతో కుటుంబ సభ్యులు ఆమెను విజయనగరంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ఈసీజీ, స్కానింగ్ పరీక్షలు చేసిన తర్వాత గుండెకు ఆపరేషన్ చేయాలన్నారు. దీంతో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఆమెకు శస్త్రచికిత్స చేశారు.



సర్వజన ఆస్పత్రిలో ఉన్న ఆరోగ్యశ్రీ హెల్ప్‌డెస్క్



☛ ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు కానూరు శ్రీను. ఇతనిది దత్తిరాజేరు మండలం ఇంగిలాపల్లి గ్రామం. ఆయాసం, నీరసంగా ఉంటుందని విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చూపించగా, అతనికి పరీక్షలు నిర్వహించి ఆపరేషన్ చేయాలని నిర్ణయించారు. ఇతనికి ఆరోగ్యశ్రీ కార్డు ఉండడంతో ఉచితంగా శస్త్రచికిత్స చేయడంతో ప్రాణాలతో బయటపడ్డాడు.

33 ఆస్పత్రులు

జిల్లాలో 33 ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులున్నాయి. ఇందులో ప్రైవేట్ నెట్‌వర్క్ ఆస్పత్రులు 18 ఉన్నాయి. అదేవిధంగా ప్రభుత్వ నెట్‌వర్క్ ఆస్పత్రులు 15 ఉన్నాయి. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ప్రస్తుతం 2,446 వ్యాధులకు చికిత్స అందిస్తున్నారు.

2.56 లక్షల శస్త్రచికిత్సలు

జిల్లాలో 2019 నుంచి 2024 మార్చి నాటికి 2.56 లక్షల శస్త్రచికిత్సలు చేశారు. ఇందుకోసం ప్రభుత్వం 537.01 కోట్ల రూపాయలు వచ్చించింది. ఆరోగ్యశ్రీ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉచితంగా చికిత్స అందిస్తున్నారు.

ఐదేళ్లలో ఆరోగ్యశ్రీ సేవల వివరాలు..

సంవత్సరం	రోగుల సంఖ్య	వైద్యానికి చేసిన ఖర్చు
2019–20	31,357	రూ. 73.06 కోట్లు
2020–21	35,776	రూ.84.69 కోట్లు
2021–22	62,508	రూ.123.59 కోట్లు
2022–23	61053	రూ. 123.61 కోట్లు
2023–24	65,374	రూ. 126.75కోట్లు



☛ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు మోహన్‌రావు. ఇతనిది తెర్లాం గ్రామం. దగ్గు, ఆయాసం వస్తుందని విజయనగరంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చూపించగా ఈసీజీ, టూడీ ఎకో పరీక్షలు చేశారు. ఇతనికి కూడా ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా గుండె ఆపరేషన్ చేశారు. ప్రస్తుతం ఇతను కుటుంబ సభ్యులతో సరదాగా గడుపుతున్నాడు.

పోలింగ్ శాతం నమోదుకు ప్రత్యేక సిబ్బంది

- జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: కంట్రోల్ రూమ్ నుంచి ఎన్నికల పోలింగ్ శాతాన్ని నమోదు చేయడానికి సెక్టార్ల వారీగా ప్రత్యేక సిబ్బందిని నియమించినట్లు జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ, పోలింగ్ రోజున (13వ తేదీ) ప్రతి 2 గంటలకు పోలింగ్ శాతాన్ని కలెక్టరేట్‌కు తెలియజేయాలన్నారు. జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ ఓవరాల్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తారని.., సెక్టార్ వారీగా సేకరించిన సమాచారాన్ని కన్సాలిడేట్ చేసి అందించడానికి ఒక ప్రత్యేక టీమ్‌ను నియమించనున్నట్లు తెలిపారు. ఈ బృందాలు 12వ తేదీన కంట్రోల్ రూమ్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. పోలింగ్ రోజుకు ముందురోజున పోలింగ్ స్టేషన్లకు ఎన్నికల సిబ్బంది హాజరు, మాక్ పోలింగ్ ప్రారంభం, ఓటర్ టర్న్ అవుట్, తదితర వివరాలను పోలింగ్ స్టేషన్ల వారీగా రిపోర్ట్ చేయాలని సూచించారు. పోలింగ్ అనంతరం రిసెప్షన్ సెంటర్‌కు చేరేవరకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

స్వేచ్ఛగా ఓటువేద్దాం..



నృత్యం చేస్తున్న విద్యార్థులు

- అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్
- ఉత్సాహంగా ఫ్లాష్ మాబ్

విజయనగరం అర్బన్: ఓటర్లందరూ స్వేచ్ఛగా ఓటు వేయాలని అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ అన్నారు. ఓటు మన భవిష్యత్‌ను నిర్ణయిస్తుందని చెప్పారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని దాసన్నపేట రైతుబజార్ జంక్షన్, గాంధీ బొమ్మ జంక్షన్, కలెక్టరేట్ జంక్షన్ వద్ద విద్యార్థులు శుక్రవాం ఫ్లాష్‌మాబ్ నిర్వహించి, ఓటుహక్కు ప్రాధాన్యతను వివరించారు. అసిస్టెంట్ కలెక్టర్ త్రివినాగ్ సైతం విద్యార్థులతో కలసి నృత్యం చేసి ఉత్సాహపరిచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేవైసీ యాప్‌లో ప్రతి అభ్యర్థి వివరాలు ఉన్నాయని.. వాటిని చూసి సరైన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. మే 13న జరిగే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకుని శతశాతం ఓటింగ్‌కు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి, హౌసింగ్ పీడీ శ్రీనివాసారావు, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ తిరుమలరావు, రిసోర్స్‌పర్సన్ పద్మనాభం, హౌసింగ్ అధికారులు, సిబ్బంది, ఆర్‌కే డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

విజయనగరం ఫోర్ట్: అక్షయ తృతీయ సందర్భంగా బాల్య వివాహాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉన్నందున జిల్లాలోని 15 మండలాల్లో శుక్రవారం ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించినట్లు యూత్‌క్లబ్ ఎక్వీస్ ఫర్ జస్టిస్ సమన్వయకర్త జి.ఝాన్సీరాణి తెలిపారు. ఈ మేరకు పలు ప్రాంతాల్లో నిర్వహించిన సదస్సుల్లో ఆమె మాట్లాడుతూ, బాల్య వివాహాల ఎన్నో అనర్థాలు కలుగుతాయన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో యూత్ క్లబ్ డైరెక్టర్ ఎం. ప్రసాదరావు, రామకోటి, ఫల్గుణ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఉద్యోగ కల.. నెరవేరిందిలా..



"‘ఉపాధ్యాయుడు కావాలన్నది కల. డీఎస్సీకి కష్టపడి చదివాను. 1998 డీఎస్సీలో అర్హత సాధించినా కోర్టు వివాదంతో ఉద్యోగం రాలేదు. ఏళ్ల తరబడి పాలకుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూపంలో నా కల నెరవేరింది. విద్యార్థులకు చక్కగా బోధిస్తున్నాను. నా కల నెరవేర్చిన సీఎం రుణం తీర్చుకోలేనిది. మా మంచి సీఎం ఆయన.

– ఎల్.కోటకు చెందిన 1998 డీఎస్సీ ఉపాధ్యాయుడు మాట ఇది."

"మాది కొత్తవలస మండలం. ప్రజాసంకల్పయాత్రగా వచ్చిన అప్పటి ప్రతిపక్ష నేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి మా సమస్యను వివరించాం. అర్హత సాధించి ఉద్యోగానికి దూరమైన తీరును తెలియజేశాం. అధికారంలోకి వచ్చిన వెంటనే న్యాయం చేస్తామన్నారు. ఉద్యోగాలు కల్పించి మా కుటుంబాల్లో కొత్త వెలుగు నింపారు. ఈ రోజు పిల్లాపాపలతో ఆనందంగా ఉన్నామంటే ఆయన దయే. ఏ ముఖ్యమంత్రి తీసుకోలేని సాహసోపేత నిర్ణయం తీసుకున్నారు. పాలకుడంటే అలా ఉండాలి. గతంలో మేము చదువుకునేటప్పుడు పాఠశాలలో కనీసం మరుగుదొడ్డి ఉండేది కాదు. ఇప్పుడు పాఠశాలలను చూస్తే ముచ్చటేస్తోంది. పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు ఉజ్వల భవితకు ప్రభుత్వ బడులు భరోసాగా నిలుస్తున్నాయి.

– ఉద్యోగం పొందిన ఓ ఉపాధ్యాయుడి ఆనందం ఇది"

లక్కవరపుకోట: వారంతా రాత్రీ పగలు కష్టపడి చదివారు. ఉపాధ్యాయ కోర్సు పూర్తిచేసి డీఎస్సీకి అర్హత సాధించారు. కోర్టు వివాదంతో వారు ఉద్యోగాలకు దూరమయ్యారు. వారి సమస్య పరిష్కారానికి రెండు దశాబ్దాల పాటు ఏ పాలకుడూ కనీసం చొరవ చూపలేదు. సాహసం చేయలేదు. వారి వేదనను పట్టించుకోలేదు. వారికి మేలు కలిగేలా నిర్ణయం తీసుకోలేదు. ప్రస్తుత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోన్‌రెడ్డి 2018 సంవత్సరంలో నిర్వహించిన ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా నిర్వహించిన పాదయాత్రలో 1998 డీఎస్సీ అభ్యర్థులు వారి సమస్యను ఏకరువుపెట్టారు. ఉన్నత విద్యావంతులైన ఉపాధ్యాయ అభ్యర్థుల సమస్యను జగన్‌మోన్ రెడ్డి సావదానంగా ఆలకించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 1998 డీస్సీలో అర్హత పొందిన వారందరికీ ఉద్యోగాలు ఇస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టిన తరువాత రాష్ట్రవ్యాప్తంగా 4,072 మందికి, జిల్లాలో 490 మందికి పోస్టింగ్‌లు కేటాయించి వారిలో ఆనందం నింపారు. అందుకే వారంతా మా మంచి సీఎం అంటూ జగన్‌ను ప్రశంసిస్తారు. ఎన్నికలవేళ హామీ ఇచ్చి 14 ఏళ్లపాటు సీఎంగా పనిచేసిన చంద్రబాబునాయుడు మోసం చేశారంటూ ఇప్పటికీ ఆవేదన వ్యక్తంచేస్తుంటారు.

"మా ఆయన బాగా చదువుకున్నారు. 1998 డీఎస్సీలో అర్హత సాధించినా ఉద్యోగం రాకపోవడంతో ఎంతో వేదనకు గురయ్యేవారు. ఊరిలోని వ్యక్తుల సూటిపోటిమాటలకు బాధపడేవారు. కష్టపడి చదివినా ఫలితం లేకపోయిందంటూ మనోవేదన చెందేవారు. ఆర్థికంగానూ ఇబ్బందులు పడ్డాం. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రూపంలో మా ఆయనకు ఉద్యోగం వచ్చింది. సంతోషంగా ఉన్నాం. మేము ఉదయం లేచి ముందు చూసేది సీఎం ఫొటోనే. ఆయన మేలు ఎన్నటికీ మరచిపోలేనిది.

– జామి మండలానికి చెందిన ఓ ఉపాధ్యాయుడి భార్య సంతోషం ఇది

ఓటు వేసేందుకు గుర్తింపుకార్డు తప్పనిసరి



పార్వతీపురం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేసేందుకు 13 రకాల గుర్తింపు కార్డులను వినియోగించేందుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిందని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిషాంత్‌కుమార్ తెలిపారు. ఓటరు గుర్తింపుకార్డు కలిగిన ఓటర్లు దానిని పోలింగ్ కేంద్రాల్లో గుర్తింపుకార్డుగా ఉపయోగించి ఓటు హక్కు వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. ఎన్నికల సిబ్బంది పంపిణీ చేస్తున్న ఓటరు స్లిప్ కేవలం పోలింగ్ కేంద్రం వివరాలు తెలియజేసేందుకు మాత్రమే అని, ఆ స్లిప్‌ను గుర్తింపుకార్డుగా ఉపయోగించేందుకు అవకాశం లేదన్నారు. పోలింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు కాని అనుమతించబోమని స్పష్టం చేశారు. ఓటరు గుర్తింపుకార్డు లేని ఓటర్లు ఈ కింద తెలియజేసిన ఏదో ఒక కార్డును గుర్తింపుకార్డుగా చూపించవచ్చని తెలిపారు.

గుర్తింపుకార్డులివే..

ఆధార్ కార్డు, ఎంఎన్‌ఆర్‌ఈజీఎస్ జాబ్‌కార్డ్, బ్యాంకు, తపాలాశాఖకు సంబంధించిన పాస్‌బుక్, కేంద్ర కార్మికశాఖ జారీ చేసిన హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, కేంద్ర కార్మికశాఖ పథకం జారీచేసిన స్మార్ట్‌కార్డు, పాస్‌పోర్టు, ఫొటో కలిగిన పెన్షన్ డాక్యుమెంట్, ఉద్యోగులకు జారీచేసిన ఐడెంటిటీకార్డులు, ఎమ్మెల్యే, యునిక్ డిజిబుల్టీ ఐడీ కార్డు, ఎమ్మెల్సీ, ఎంపీ జారీచేసిన గుర్తింపుకార్డు ఉపయోగించుకోవచ్చని వివరించారు.

నాకు ఒక కన్ను పోయినా ఫరవాలేదు. పక్కవాడికి రెండు కళ్లు పోవాలన్న చందంగా ఉంది టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు అండ్ కో, ఎల్లో మీడియా పరిస్థితి. రాష్ట్రంలోని ప్రజల భూములకు శాశ్వత భూ హక్కు కల్పించి పక్కా రికార్డులను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తయారు చేయిస్తుంటే ఓర్చుకోలేకపోతున్న చంద్రబాబు, ఆయన భజన బృందం ప్రభుత్వంపై అక్కసు వెళ్లగక్కుతోంది. రాష్ట్ర ప్రజలను మెప్పించలేక, తాము విడుదల చేసిన అబద్ధపు మేనిఫెస్టోతో ఓటర్లను నమ్మించలేక నానా యాతన అనుభవిస్తోంది. ఎలాగైనా ఓటర్లను తమ విషకౌగిలిలోకి లాక్కోవాలన్న పన్నాగంతో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్, భూముల రీసర్వేపై విషప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు శతవిధాలా ప్రయత్నిస్తోంది.

–పార్వతీపురం టౌన్

చేతకాక.. చేవలేక..!

- ఎన్నికల్లో ఓటమి భయంతో కుట్రలు
- టీడీపీ హామీలను ప్రజలు నమ్మడం లేదని ఆక్రోశం
- ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై మద్దతుదారు మీడియాతో విషప్రచారం
- రాష్ట్రంలో వందేళ్ల క్రితం చేపట్టిన భూముల రీ సర్వేపై విషం
- మూడో దశ రీసర్వే జరగకుండా ప్రజలకు ఐవీఆర్ఎస్ కాల్స్
- బాబును గద్దెనెక్కించాలని ఎల్లోమీడియా తాపత్రయం
- ప్రజలను అభద్రతా భావంలోకి నెట్టి గెలవాలనే పన్నాగం

వాస్తవానికి టీడీపీ జమానాలో రాష్ట్రంలో 25 లక్షల ఎకరాల భూములను 22(ఎ) జాబితాలో చేర్చడంతో..పక్కా రికార్డులున్న భూముల రైతులు నానా తిప్పలు పడ్డారు. అవసరమైన సమయంలో భూములు విక్రయించలేక అప్పులు చేయాల్సి వచ్చేది. ఈ తరుణంలో అధికారం చేపట్టిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 22(ఎ) జాబితా నుంచి లక్షలాది ఎకరాల భూములను తొలగించారు. వందేళ్ల తర్వాత అధునాతన సాంకేతికతతో భూముల రీసర్వేకు శ్రీకారం చుట్టి దేశమంతా రాష్ట్రం వైపు చూసేలా చేశారు.

అయితే..భూ సర్వే ప్రక్రియపై తొలినుంచీ విషప్రచారం చేస్తున్న పచ్చ విషనాగులు ఎన్నికల వేళ మళ్లీ బుసకొడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోని నీతి ఆయోగ్ సిఫార్సు చేసిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను భ్రష్టు పట్టించి, ప్రజల్ని ఆందోళనకు గురిచేసేలా తప్పుడు ప్రచారానికి దిగిన చంద్రబాబుకు తోడుగా రాజగురివింద డ్రామోజీ రావు తన పత్రికలో పేజీలకు పేజీలు అబద్ధాలు అచ్చేసి విషం చిమ్ముతున్నారు.

శాశ్వత భూహక్కు ద్వారా భూములు పదిలం

రాష్ట్రప్రభుత్వం చేపట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం ద్వారా ప్రభుత్వ, ప్రైవేట్ భూములు పదిలం కానున్నాయి. ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాసమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమానికి వస్తున్న అర్జీల్లో భూ సమస్యలకు సంబంధించినవే ఎక్కువగా ఉంటున్నాయి. రెవెన్యూ రికార్డుల్లో జరిగిన తప్పిదాలతో భూ వివాదాలు పెరగడంతో ప్రభుత్వం రీ సర్వేకు నిర్ణయం తీసుకుంది. దీంతో దాదాపు భూ సమస్యలు పరిష్కారం అవుతున్నాయి. రీ సర్వే కోసం సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కచ్చితమైన రేఖాంశాలు, అక్షాంశాలు గుర్తించి హద్దులు నిర్ణయిస్తున్నారు. దీంతో గ్రామాల సరిహద్దుల నుంచి నివాస ప్రాంతాల ఇళ్లు, ఖాళీ స్థలాల వరకు మొత్తం ఇమేజ్‌లతో పాటు హద్దులు పక్కాగా నిర్ణయిస్తున్నారు.



పార్వతీపురం మండలంలోని బందలుప్పి గ్రామంలో రీసర్వే (ఫైల్)

రెండు దశలు పూర్తి..

పార్వతీపురం మన్యం జిల్లాలో చేపట్టిన రీ సర్వే..రెండు విడతల్లో మొత్తం 248 గ్రామాల్లో పూర్తయింది. మొదటి దశలో 15 మండలాల్లోని 95 గ్రామాల్లో, రెండో దశలో 15 మండలాల్లోని 153 గ్రామాల్లో 3,09,341 ఎకరాలకు సంబంధించిన రీ సర్వే పూర్తి చేశారు. గత ఏడాది సెప్టెంబర్ నుంచి మూడో విడతలో 15 మండలాల్లోని 107 గ్రామాలు లక్ష్యంగా రీ సర్వేను వేగవంతం చేశారు. దాదాపు అది కూడా పూర్తి కావస్తోంది.

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో..

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించడం ద్వారా జిల్లా మొత్తం కవర్ అయ్యేలా 5 బేస్‌స్టేషన్లు ఏర్పాటు చేశారు. ఒక్కో బేస్‌స్టేషన్ సుమారు 35 కిలోమీటర్ల పరిధి వరకు సిగ్నల్స్ తీసుకుంటుంది. దీంతో 5 బేస్ స్టేషన్ల ద్వారా జిల్లా మొత్తం కవర్ కానుంది. జిల్లాలోని పార్వతీపురం, కురుపాం, సాలూరు, పాలకొండ ప్రాంతాల్లో బేస్‌స్టేషన్లను ఏర్పాటు చేశారు. రీ సర్వేలో రోవర్లను వినియోగిస్తున్నారు. ఈ రీ సర్వేలో సర్వే ఆఫ్ ఇండియా, గ్లోబల్ పొజిషన్ సిస్టం, డ్రోన్ టీమ్, హై ప్రిసిసన్ లెవెలింగ్ బృందాలతో పాటు మండల, గ్రామ సర్వేయర్లు పనిచేస్తున్నారు.

సమస్యను పరిష్కరించిన ముఖ్యమంత్రి

ఏళ్ల తరబడి రైతు కుటుంబాల్లో చీకట్లు నింపిన నిషేధిత భూముల సమస్యను సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పరిష్కరించారు. టీడీపీ జమానాలో 22(ఎ) జాబితాలో భూములు చేర్చడం వల్ల క్రయ విక్రయాలకు అవకాశం లేక, ప్రభుత్వ పథకాలు అందక, చివరికి విత్తనాలు, పురుగుమందుల సబ్సిడీ కూడా దక్కక రైతులు ఇబ్బందులు పడ్డారు. ఈ తరుణంలో వైఎస్సార్‌సీపీ హయాంలో భూముల హద్దులు పక్కాగా నిర్ణయించేలా రీ సర్వే చేస్తూనే, మరో పక్క నిషేధిత జాబితాలోని భూములకు మోక్షం కల్పించారు. జిల్లాలో రైతులకు సంబంధించి సర్వీస్ ఇనాం భూములు, 20 ఏళ్లకు పైబడిన ఫ్రీహోల్డ్ అసైన్‌మెంట్ భూములకు సంబంధించి రైతులకు చెందిన భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించారు. అదేవిధంగా పెద్ద సంఖ్యలో రైతులకు సంబంధించి చుక్కల భూములకు క్లియరెన్స్ ఇచ్చారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా భూములు పొందిన వారికి సంబంధించి నిషేధిత జాబితా నుంచి తొలగించారు. నిషేధిత జాబితా నుంచి తొలగించిన భూములే కాకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇటీవల రైతులకు కొత్తగా అసైన్ చేసిన భూములకు పాస్‌పుస్తకాలు అందజేశారు.

జిల్లావ్యాప్తంగా రీ సర్వే ఇలా..	
మండలాలు	15
రెవెన్యూ గ్రామాలు	965
జియోగ్రాఫికల్ సర్వే	2340.54 చదరపు కిలోమీటర్లు
మొదటి విడత సర్వే అయిన గ్రామాలు	95
రెండవ విడత సర్వే చేసిన గ్రామాలు	153
మూడవ విడత సర్వే లక్ష్యం గ్రామాలు	107
మూడవ విడత విడత సర్వే పూర్తి చేసిన గ్రామాలు	27
విధుల్లో పాల్గొన్న సర్వేయర్లు	310 మంది



భామిని మండలం కోసలిలో రీసర్వే (ఫైల్)

పరాయి సొమ్ముపై దురాశ

కింజరాపు మైనింగ్ దందా



కేసు నమోదు

- ఆగని అచ్చెన్న ఫ్యామిలీ గ్రానైట్ బాగోతం
- దుర్గా భవానీ పాలిషింగ్ యూనిట్‌కు అక్రమంగా బ్లాకుల తరలింపు
- ఒక పర్మిట్‌తో రెండు మూడు లోడ్ల అక్రమ తరలింపు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

అచ్చెన్నాయుడుకు 'పరాయి' సొమ్ముపై దురాశ తగ్గలేదు. అధికారంలో ఉన్నంత కాలం మైనింగ్ దందా చేశారు. 2014 నుంచి 2019 వరకు చెలరేగిపోయారు. గత ఎన్నికల్లో టీడీపీ ఓడిపోయినా కూడా వెనక్కి తగ్గలేదు. ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొట్టి పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడ్డారు. కలర్ గ్రానైట్‌ను అక్రమ తరలింపు చేయడమే కాకుండా అడ్డగోలుగా విక్రయాలు జరిపారు. ఈ మొత్తం వ్యవహారాన్ని మైనింగ్ అధికారులు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేసి అచ్చెన్నాయుడు కుటుంబీకులకు చెందిన గ్రానైట్ ఇండస్ట్రీ బండారం బయట పెట్టారు. దీనిపై పక్కా ఆధారాలతో కోటబొమ్మాళి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 379, 420, 477–ఎ, 406, 120బి, 34ఐపీసీ సెక్షన్ల కింద పోలీసులు కేసు కూడా నమోదు చేశారు.



కింజరాపు అచ్చెన్నాయుడు ఫ్యామిలీకి చెందిన దుర్గా భవానీ పాలిషింగ్ యూనిట్‌కు అక్రమంగా బ్లాకులు తరలిస్తూ పట్టుబడిన వాహనం

కోటబొమ్మాళి మండలం పెద్ద బమ్మిడి గ్రామంలో సర్వే నంబర్ 106/1,104/9లో టీడీపీ అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు సోదరుడు హరిప్రసాదరావు కుమారుడు సురేష్‌కుమార్ పేరున శ్రీ దుర్గా భవానీ గ్రానైట్ ఇండస్ట్రీ ఉంది. 2018 ఏప్రిల్ 23వ తేదీ నుంచి 2038 ఏప్రిల్ 22వ తేదీ వరకు దాదాపు 20 ఏళ్ల మినరల్ డీలర్ లైసెన్సు తీసుకున్నారు. రఫ్ గ్రానైట్ బ్లాక్‌ల కటింగ్, పాలిషింగ్ తదితర కార్యక్రమాలను ఈ ఇండస్ట్రీ చేపడుతుంది. దీంట్లో నాథూరాం చౌదరి, పొన్నాం దాలినాయుడు, పొన్నాం భాస్కరరావు, రావాడ మోహనరావు పార్ట్‌నర్లుగా ఉన్నారు. జిల్లాలో అనేక కలర్ గ్రానైట్ క్వారీల నుంచి గ్రానైట్ బ్లాక్‌లను అధికారికంగా అనుమతి తీసుకుని తమ ఇండస్ట్రీకి రవాణా చేసుకోవల్సి ఉంది. కానీ, అచ్చెన్న కుటుంబీకులకు చెందిన ఈ ఇండస్ట్రీలో అందుకు భిన్నంగా వ్యవహారాలు నడుస్తున్నాయి.

2022 మే 8వ తేదీన వచ్చిన సమాచారం మేరకు కంచిలి మండలం భైరీపురం గ్రామంలోని రానా గ్రానైట్ అండ్ మినరల్ క్వారీ నుంచి గ్రానైట్ బ్లాక్‌లను తరలిస్తున్న వాహనాన్ని(ఏపీ30టీఎ 1089) మైనింగ్, విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. ఆ సమయంలో గడువు దాటిన పర్మిట్‌తో అక్రమంగా తరలిస్తున్నట్టుగా తనిఖీ అధికారులు గుర్తించారు. దీంతో సిబ్బంది స్టేట్‌మెంట్ తీసుకుని వాహనం సీజ్ చేశారు. దీనిపై మైనింగ్, విజిలెన్స్ అధికారులు లోతుగా విచారణ జరిపారు. పలాస దగ్గర ఉన్న టోల్ ప్లాజాలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా పట్టుకున్న ఏపీ 30టీఎ 1089 వాహనం నిర్దేశిత ట్రాన్సిట్ గడువు సమయంలో మూడు సార్లు లోడింగ్, అన్‌లోడింగ్‌తో అటు ఇటు వెళ్లినట్టు రికార్డయ్యింది. దీంతో ఒక ట్రాన్సిట్ ఫారంతో రెండు మూడు సార్లు గ్రానైట్ బ్లాక్‌ల అక్రమ తరలింపు జరిగినట్టు నిర్ధారించారు.

ఈ గ్రానైట్ బ్లాక్‌లు రవాణా జరిగిన అచ్చెన్నాయుడు ఫ్యామిలీకి చెందిన శ్రీ దుర్గా భవానీ గ్రానైట్ ఇండస్ట్రీని, అటు కంచిలిలో ఉన్న గ్రానైట్ క్వారీని పరిశీలించి, విచారణ జరిపారు. దీంతో దుర్గా భవానీ గ్రానైట్ ఇండస్ట్రీ బాగోతమంతా బయటపడింది. అధికారుల విచారణను దృష్టిలో ఉంచుకుని అప్పటికప్పుడు గ్రానైట్ బ్లాక్‌ల నంబర్లు దిద్దుబాటు చేయడం, నంబర్ల టాంపరింగ్‌కు పాల్పడటం వంటివి చేశారు. ఇవన్నీ విచారణలో వెలుగు చూశాయి. అంతేకాకుండా ఒకే నంబర్‌తో గల పలు గ్రానైట్ బ్లాక్‌లను గుర్తించారు. అలాగే, ఆన్‌లైన్‌లో ఉన్నదానికి, భౌతికంగా ఉన్న బ్లాక్‌ల నిల్వల తేడాను సైతం పట్టుకున్నారు. 172.87 క్యూబిక్ మీటర్ల బరువైన 23బ్లాక్‌లకు సంబంధించి తేడాలు ఉన్నాయి. ఇవన్నీ గ్రానైట్ క్వారీల నుంచి అక్రమంగా తరలించినట్టుగా తేల్చారు. దీనివిలువ అపరాధ రుసుంతో కలిపి రూ. 6కోట్ల వరకు ఉండవచ్చని అంచనా. ఇదంతా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం. దాన్ని అచ్చెన్న ఫ్యామిలీ వ్యూహాత్మకంగా గండి కొట్టి దోచుకుంది.

అచ్చెన్నాయుడు ఫ్యామిలీకి చెందిన శ్రీ దుర్గా భవానీ గ్రానైట్ ఇండస్ట్రీలో ప్రభుత్వ ప్రాపర్టీ దొంగతనం, టాంపరింగ్, డూప్లికేషన్, ఉన్న స్థితిని మార్చడం వంటి అక్రమాలకు పాల్పడ్డారని ఆ ఇండస్ట్రీ మేనేజింగ్ డైరెక్టర్ అచ్చెన్నాయుడు అన్న హరిప్రసాదరావు కుమారుడు సురేష్‌కుమార్, పార్టనర్‌లైన నాతూరాం చౌదరి, పొన్నాం దాలినాయుడు, పొన్నాం భాస్కరరావు, రావాడ మోహనరావుపై కోటబొమ్మాళి పోలీసు స్టేషన్‌లో శ్రీకాకుళం మైనింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.బాలాజీనాయక్ ఫిర్యాదు చేశారు. దీంతో 379, 420, 477–ఎ, 406, 120బి, 34ఐపీసీ సెక్షన్ల కింద పోలీసులు కేసు కూడా నమోదు చేశారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు లెక్కలేనన్ని గ్రానైట్ బ్లాక్‌లను తరలించిన సందర్భాలున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన కొత్తలో దుర్గా భవానీ గ్రానైట్‌లో రూ. 11కోట్ల 43లక్షల 29వేల 120మేర అక్రమాలు జరిగాయి. మరో రూ. 3కోట్ల 18లక్షల 72వేల 960మేర జీఎస్టీ చెల్లించకుండా ఎగ్గొట్టారు. అధికారం లేకపోయినా అధికారులు కళ్లు గప్పి అక్రమ రవాణాకు పాల్పడ్డారంటే అచ్చెన్నాయుడు ఫ్యామిలీ ఎంత బరితెగిస్తుందో అర్థం చేసుకోవచ్చు.

కల.. నెరవేరుతోందిలా





మూలపేట వద్ద పోర్టు కోసం నిర్మించిన సౌత్ బ్రేక్ వాటర్ నిర్మాణం

- జిల్లాకు తలమానికం మూలపేట పోర్టు
- శరవేగంగా జరుగుతున్న పోర్టు పనులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : జిల్లా రూపు రేఖలు మారుబోతున్నాయి. సీఎం వైఎస్ జగన్ చొరవతో ఇక్కడి ప్రజల దశాబ్దాల కల త్వరగా నెరవేరబోతోంది. శ్రీకాకుళం తీరానికి మణిహారంగా నిలవనున్న గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. జిల్లాకే కాదు ఉత్తరాంధ్రకు తలమానికంగా నిలిచే మూలపేట పోర్టు పనులు ప్రస్తుతం చకాచకా సాగుతున్నాయి. ల్యాండ్ లార్డ్ మోడల్ విధానంలో రూ.4,362కోట్లతో ప్రాజెక్టు తొలి దశ పనులను వీలైనంత తొందరగా పూర్తి చేసేలా నిర్మాణం వేగవంతం చేసింది. ప్రాజెక్టు పూర్తయితే ప్రత్యక్షంగా, పరోక్షంగా 25వేల మందికి ఉపాధి లభిస్తుంది. ప్రభుత్వానికి ఆదాయం పెరగనుంది. చుట్టు పక్కల ప్రాంతమంతా పారిశ్రామికంగా అభివృద్ధి చెందనుంది.

శరవేగంగా పోర్టు పనులు

సీఎం చేతులమీదుగా శంకుస్థాపన జరిగిన కొన్ని రోజులకే పోర్టు పనులు ప్రారంభమయ్యాయి. సౌత్ బ్రేక్ వాటర్ పనులు, పైలింగ్ ప్రాజెక్టు విస్తరణ పనులు, బెర్తుల నిర్మాణ పనులు జోరుగా జరుగుతున్నాయి. ఇప్పటికే సముద్రంలోకి సౌత్ వాటర్ బ్రేక్ పనులు 2.4కిలోమీటర్లకు గాను 1110మీటర్ల మేర పూర్తయ్యింది. నార్త్ బ్రేక్ వాటర్ పనులు 580 మీటర్ల మేర పూర్తయ్యాయి. ఈ పనులకు 9లక్షల టన్నుల బండ రాళ్లను వినియోగించారు. బెర్త్‌ల నిర్మాణ పనులకు విదేశాల నుంచి డ్రిల్లింగ్ యంత్రాలను, నిపుణులను తీసుకొచ్చారు. ప్రస్తుతం ఆ పనులు జరుగుతున్నాయి. వచ్చే ఏడాది మొదటి నాలుగు బెర్తుల నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. పైలింగ్ పనులు పూర్తయ్యాయి. క్యాటింగ్ యార్డు పనులు జోరుగా జరుగుతున్నాయి. కాంక్రీటు తయారీ కోసం ఏకంగా బ్లాచింగ్ చిప్స్ ప్లాంటు ఏర్పాటు చేశారు. ఒకవైపు పోర్టు నిర్మాణ పనులు చేపడుతూనే మరోవైపు పోర్టు కోసం భూములిచ్చి నిరాశ్రయులైన మూలపేట, విష్ణుచక్రం గ్రామాలకు చెందిన 59 6కుటుంబాలకు రూ. 35కోట్లతో ఆర్అండ్ఆర్ కాలనీ నిర్మాణం పనులు యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నారు. ఒక్కో కుటుంబానికి 5సెంట్ల స్థలంలో ఇళ్లు నిర్మిస్తున్నారు.

రూ. 4,362 కోట్లతో మూలపేట పోర్టు

తూర్పు తీరంలో ఉత్తరాంధ్రలో ప్రస్తుతం విశాఖపట్టణం పోర్టు ఒక్కటి మాత్రమే జల మార్గంలో వ్యాపార లావాదేవీలకు అనుకూలంగా ఉంది. ఆ తర్వాత శ్రీకాకుళం జిల్లా నుంచి ఒడిశా, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్‌లకు జల మార్గంలో అతి తక్కువ దూరం కలిగిన పోర్టు మరొకటి లేదు. దీంతో రాష్ట్రంలో నాలుగు చోట్ల పోర్టులు నిర్మిస్తున్నా అత్యంత వేగంగా అభివృద్ధి చెందే అవకాశం ఉన్న పోర్టుగా మూలపేట పోర్టును ప్రతిష్ఠాతకంగా వైఎస్ జగన్ ప్రభుత్వం తీసుకుంది. దానిలో భాగంగా ల్యాండ్ లార్డ్ మోడల్ విధానంలో రూ. 4,362కోట్లతో తొలి విడత ప్రాజెక్టు పనులు చేపడుతోంది. వార్షిక సామర్థ్యం 83.3మిలియన్ టన్నులు కాగా, తొలి దశలో 23.5మిలియన్ టన్నుల సామర్థ్యంతో నాలుగు బెర్తుల నిర్మాణం, ఇతర మౌలిక వసతుల కల్పన పనులు చేపడుతోంది. నాలుగు బెర్తుల్లో రెండు జనరల్ కార్గోకు, ఒకటి బొగ్గు, ఇంకొకటి కంటైనర్‌తో పాటు ఇతర ఎగుమతి, దిగుమతులకు వినియోగిస్తారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఇక్కడ దొరుకుతున్న అంతర్జాతీయ ఖ్యాతి ఉన్న నీలి గ్రానైట్ తదితర ఖనిజాలు, జిల్లా తీర ప్రాంతంలో లభ్యమవుతున్న లక్షా 95వేల మెట్రిక్ టన్నుల మత్స్య సంపద, పలాస జీడిపప్పు, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ తదితర ప్రాంతాలకు చెందిన మినరల్ శాండ్, ముడి ఇనుము, సోయామీల్ ఎగుమతులకు ఉపయోగపడుతుంది. థర్మల్ బొగ్గు, కుకింగ్ కోల్, ఎరువులు,ముడి జీడి గింజలు, సున్నపురాయి, వంట నూనెల దిగుమతికి ఉపయోగపడనుంది.



పోర్టు కోసం సముద్రంలోకి వేసిన రోడ్డు



పోర్టు లోపల జరుగుతున్న అభివృద్ధి పనులు

విష్ణు చక్రం నుంచి సాల్ట్ భూముల వరకు దాదాపు రెండు కిలోమీటర్ల మేర మట్టి రోడ్డును వేశారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

- జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్



మొక్కలు నాటుతున్న జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: సాధారణ ఎన్నికల్లో ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్ పిలుపునిచ్చారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ శుక్రవారం ఉదయం శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటుచేసిన పర్యావరణ సహిత ఓటర్ల అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రభుత్వ మహిళా కళాశాల ఆవరణలో మొక్కలు నాటి, పలువురికి మొక్కలు అందజేశారు. అనంతరం ఆయన అనంతరం మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో అందరి చేతిలో ఆయుధం ఓటు అని, 18 ఏళ్లు నిండి ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఎన్నికల్లో పోలింగ్ రోజు ఓటు వేయాలన్నారు. 2019 ఎన్నికల కన్నా ఈ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరగాలని ఆకాంక్షించారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 6 వరకు పోలింగ్ జరుగుతుందన్నారు.

ఇండియన్ డెంటల్ అసోసియేషన్ శ్రీకాకుళం బ్రాంచ్ దంత వైద్యులు డాక్టర్ శిల్లా సతీష్ కుమార్, డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ ఊడి సంతోష్ ఆధ్వర్యంలో ర్యాలీని ఆయన ప్రారంభించారు. సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్, ఎల్‌డీఎం సూర్య కిరణ్, మెప్మా పీడీ కిరణ్, ఎన్‌వైకే కోఆర్డినేటర్ ఉజ్వల్, బీసీ కార్పొరేషన్ ఈడీ గడ్డెమ్మ, సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు విశ్వమోహన్ రెడ్డి, గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారి వాసుదేవరావు, స్వీప్ స్వచ్ఛంద సంస్థ కొమ్ము రమణ మూర్తి, ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్య చంద్ర రావు తదితరులు పాల్గొన్నారు.

నీలమణి దుర్గ మహోత్సవాలు ప్రారంభం

పాతపట్నం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవమైన నీలమణి దుర్గ అమ్మవారి 49వ మహోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలతో పాటు కుంకుమపూజ, అష్టోత్తర శతనామ పూజ, హోమాలను అర్చకుల బృందం నిర్వహించారు. మొదటి రోజు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, పరిషత్ ప్రాయశ్చిత్తం, దీక్షా ధారణ, అగ్ని ప్రతిష్ట, అమ్మవారి మూల మంత్ర హోమాలు వేదోక్తంగా జరిగాయి. తెల్లవారు జాము నుంచి అధిక సంఖ్యలో భక్తులకు అమ్మవారిని దర్శించుకుని, అమ్మవారి పూజల్లో పాల్గొన్నారు. ఆంధ్రా, ఒడిశా నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆ పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా పెట్టాల్సిందే

- టెక్కలి నియోజకవర్గంలో రిగ్గింగ్‌లకు ఆస్కారం కలిగిన పోలింగ్ కేంద్రాలు
- అనాదిగా అక్కడ రిగ్గింగ్ చేస్తున్న టీడీపీ



కోటబొమ్మాళి మండలం నిమ్మాడలో రిగ్గింగ్‌కు అవకాశం ఉన్న పోలింగ్ బూత్

టెక్కలి: సార్వత్రిక ఎన్నికలు పక్కాగా నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ పక్కాగా చర్యలు చేపడుతోంది. అయితే టెక్కలి నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేకంగా దృష్టిపెట్టాలని స్థానిక ఓటర్లు కోరుతున్నారు. ఈ నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో అనాదిగా టీడీపీ, అందులోనూ కింజరాపు కుటుంబీకులు రిగ్గింగ్‌కు పాల్పడుతున్నారు. తమకు అనుకూలంగా ఉన్న పోలింగ్ కేంద్రాల్లో ఈ సారి అనుకూలంగా ఓట్లు వేసుకునేందుకు ఇప్పటికే టీడీపీ వర్గాలు క్షేత్ర స్థాయిలో పావులు కదుపుతున్నారు. టెక్కలి, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, నందిగాం తదితర మండలాల్లోని పలు పోలింగ్ కేంద్రాల్లో గత కొన్నేళ్లుగా అదే తంతు జరుగుతోంది. అయితే ఈ సారి ఆయా పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా వేయాలని పలువురు కోరుతున్నారు.

నిఘా పెట్టాల్సిన కేంద్రాలివే..

- కోటబొమ్మాళి మండలంలో నిమ్మాడ, వాండ్రాడ, తులసిపేట, పెద్దబమ్మిడి, చిన్నబమ్మిడి, చిన్నవెంకటాపురం, సాలిపేట, అక్కయ్యవలస, చవితిపేట, చిన్నతుంబయ్యపేట, చిన్నవెంకటాపురం, కస్తూరిపాడు, కిష్టుపురం, కొత్తపేట, కురుడు, సోడాం, నరసింగపల్లి, పట్టుపురం, తాటిపర్తి, తిలారు, వీరరాఘవపురం, విశ్వనాథపురం, కోటబొమ్మాళిలో 302 నుంచి 311 తదితర పోలింగ్ బూత్‌లపై ప్రత్యేక నిఘా వేయాలి.
- సంతబొమ్మాళి మండలంలో మూలపేట, చిన్నతుంగాం, పెద్దతుంగాం, కాశీపురం, చెట్లతాండ్ర, ఆరికివలస, అంట్లవరం, కాకరాపల్లి, వడ్డివాడ, జన్నాథపురం, పాలతలగాం, భావనపాడు, బడేకుప్పన్నపేట, బోరుభద్ర, బృందావనం, జొన్నలపాడు, కాపుగోదాయవలస, కొల్లిపాడు, లక్కివలస, లింగూడు, మర్రిపాడు, పాతమేఘవరం, తాళ్లవలస, ఉమిలాడ, సంతబొమ్మాళిలో 188 నుంచి 194 తదితర పోలింగ్ కేంద్రాల్లో రిగ్గింగ్‌లు జరిగే అవకాశం ఉంది.
- టెక్కలి మండలంలో భగవాన్‌పురం, చింతలగార, పాతనౌపడ, అయోధ్యపురం, పోలవరం, రావివలస, టెక్కలిలో 97 నుంచి 152 వరకు తదితర పోలింగ్ కేంద్రాల్లో రిగ్గింగ్‌లకు అవకాశం ఉంది.
- నందిగాం మండలం దొడ్ల రామచంద్రాపురం, కవిటి, దిమిడిజోల, రౌతుపురం, సైలాడ, తమలాపురం, నందిగాంలో 67 నుంచి 69 పోలింగ్ బూత్‌లు, పోలింగ్ కేంద్రాల్లో రిగ్గింగ్‌లు జరిగే అవకాశాలు ఉన్నాయి.
- సమస్యాత్మక కేంద్రాల్లో వీడియో క్యాస్టింగ్ చేస్తామని ఈసీ ఇప్పటికే చెప్పింది. దీంతో పాటు ఈ కేంద్రాల వద్ద గట్టి భద్రతా చర్యలు కూడా చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

తప్పుడు ప్రచారం మానుకో చంద్రబాబూ

- రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు



గారలో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్

గార: ల్యాండ్ టైట్లింగ్ యాక్టుపై తప్పుడు ప్రచారాన్ని చంద్రబాబు మానుకోవాలని, ప్రజలకు క్షమాపణలు చెప్పాలని రాష్ట్ర రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. ఆయన శుక్రవారం గార, శ్రీకూర్మం పంచాయతీల్లో వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌తో కలిసి ప్రచారం నిర్వహించారు. కేంద్రం ఈ చట్టాన్ని నీతి ఆయోగ్ తెచ్చిందని చెబుతున్నా, చంద్రబాబు మాత్రం సిగ్గు లేకుండా తప్పుడు వార్తలు ప్రచారం చేయిస్తున్నారని మండిపడ్డారు. గత ఐదేళ్లు వైఎస్సార్ సీపీ అధికారంలో ఉందని, అంతకుముందు టీడీపీ అధికారంలో ఉందని, ఈ రెండు పార్టీల నిబద్ధతను ప్రజలు గమనించాలని సూచించారు. జిల్లాలో మూలపేట పోర్టు పనులు శరవేగంగా జరుగుతున్నారు. రెడ్డి సామాజిక వర్గానికి భవనం కోసం రెండు ఎకరాలు కేటాయించామన్నారు. శ్రీశయనుల కోసం అనేక పదవులు ఇచ్చామన్నారు. నాయీ బ్రాహ్మణులకు గౌరవంతో పాటు దేవాలయాల్లో సభ్యులుగా నియమిస్తున్నామని తెలిపారు.

ఆశీర్వదించండి..

వైఎస్సార్ సీపీని ప్రజలంతా ఆశీర్వదించాలని, జిల్లాను మరింత అభివృద్ధి చేస్తానని శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ అన్నారు. కులాలు, మతాలకు అతీతంగా పథకాలు అందించిన నాయకుడు వైఎస్ జగన్ అని తెలిపారు. 2014–19 మధ్యలో పథకాలన్నీ జన్మభూమి కమిటీలు తినేశాయన్నారు. ఈ ప్రభుత్వంలో గ్రామాల్లో సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి జనాలకు సంక్షేమం చేరువ చేశామని చెప్పారు. విశాఖ పరిపాలన రాజధాని కావాలని ధర్మాన కోరారని, ఇలాంటి వ్యక్తులను ఎన్నుకోవాలన్నారు. మూలపేట పోర్టుతో పాటు కిడ్నీ ఆస్పత్రి, ఉద్దానంకు మంచినీటి ప్రాజెక్టు అందించారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మార్పు సుజాతమ్మ, మార్పు ధర్మారావు, ఎంపీపీ గొండు రఘురామ్, డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, ఏఎంసీ చైర్మన్ బరాటం నాగేశ్వరరావు, సర్పంచ్ గోరు అనిత, వైస్ ఎంపీపీ అందవరపు బాలకృష్ణమూర్తి, బొడ్డేపల్లి పద్మజ, మార్పు పృథ్వీరాజ్, ముంజేటి కృష్ణమూర్తి, జల్లు రాజీవ్, ఆరంగి రమణమూర్తి, పుల్లటి నాగేశ్వరరావు, పీస గోపి, మార్పు మన్మధరావు, ఆరంగి రాంబాబు, పుల్లటి శశిభూషణరావు, ఎంపీటీసీలు ఊట అప్పలనాయుడు, కురమాన మునెమ్మ, ఉప్పాడ ఆదిలక్ష్మి, బరాటం నాగరాజు, పల్ల రాధాకృష్ణ, అనుపోజు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'వైఎస్సార్‌సీపీ విజయమే మా లక్ష్యం'



వైఎస్సార్‌సీపీకి మద్దతుగా బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం పేద ప్రజలకు అన్ని రకాల పథకాలు అందించి వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నారని, వైఎస్సార్‌సీపీకి మరోసారి పట్టం కట్టాలని న్యాయవాదులంతా కోరారు. శ్రీకాకుళం నగరంలో వారంతా శుక్రవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిట్ట దామోదరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్, జిల్లాలో మంత్రి ధర్మాన, ఎంపీగా పేరాడ తిలక్ మనకు అవసరమన్నారు. అభివృద్ధి, సంక్షేమం సమానంగా జరగాలంటే వైఎస్సార్‌సీపీతోనే సాధ్యపడుతుందన్నారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై చంద్రబాబు దుష్ప్రచారం సరికాదని, ప్రజలంతా వాస్తవాలను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో రీజనల్ కో ఆర్డినేటర్ గేదెల వాసుదేవరావు, కార్యదర్శులు పొన్నాడ వెంకటరమణ, ఆరంగి లక్ష్మీ పతి, సీనియర్ న్యాయవాది, నౌపాడ విజయ్ కుమార్, జీవ రత్నం, సంపత్ కుమార్, పొన్నాడ రుషి, కృష్ణంరాజు, అప్పలరాజు, సీనియర్, జూనియర్ లీగల్ సెల్ న్యాయవాదులలతో పాటు లీగల్ సెల్ మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయి ఏర్పాట్లు



రిసెప్షన్ కేంద్రాల ఏర్పాటు పరిశీలిస్తున్న శ్రీకాకుళం నగర పాలక సంస్థ కమిషనర్ తమీమ్ అన్సారియా



శివానీ కళాశాల బయట రోడ్ల నిర్మాణం



ఏర్పాటు చేసిన రిసెప్షన్ కేంద్రం



పార్కింగ్‌కు కేటాయించిన స్థలం

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెం శ్రీ శివానీ ఇంజినీరింగ్ కాలేజీలో సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఎనిమిది నియోజకవర్గాలకు సంబంధించి రిసెప్షన్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. మరో పక్క స్ట్రాంగ్ రూంలు, కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఏర్పాట్లను కళాశాలలో శ్రీకాకుళం నగర పాలక సంస్థ కమిషనర్ తమీమ్ అన్సారియా శుక్రవారం పర్యవేక్షించారు. ఎన్నికల పరిశీలకుల సూచన మేరకు ఏర్పాటు చేస్తున్నారు. ప్రధానంగా రిసెప్షన్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టిపెట్టారు. పోలింగ్ ముగిశాక 13వ తేదీ రాత్రి వేళ బస్సుల్లో ఈవీఎంలు రిసెప్షన్ కేంద్రాలకు తరలిస్తారు. రిసెప్షన్ కేంద్రాల నుంచి స్ట్రాంగ్ రూమ్‌లకు తరలిస్తారు. ప్రధానంగా జాతీయ రహదారి నుంచి కళాశాల వెలుపల నుంచి రోడ్లు నిర్మిస్తున్నారు. పార్కింగ్, ట్రాఫిక్ సమస్య లేకుండా వాహనాలు కళాశాలకు చేరేలా చర్యలు తీసుకుంటున్నారు. గత ఎన్నికల్లో పెద్ద ఎత్తున జాతీయ రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయింది. అలాంటి పరిస్థితులు రాకుండా అధికారులు ముందస్తు ప్రణాళికతో సాగుతున్నారు.

యామలపేటలో జీడితోట దగ్ధం



దగ్ధమైన జీడితోటలో రైతు ఆనందరావు

సంతబొమ్మాళి: మండలం యామలపేటలో శుక్రవారం విద్యుత్ వైర్ల షార్ట్ సర్క్యూట్ కారణంగా సుమారు రెండు ఎకరాల జీడితోటలు దగ్ధమయ్యాయి. బాధితులు తెలిపిన వివరాలు మేరకు.. గ్రామానికి చెందిన రైతు గద్దాయి ఆనందరావు జీడితోటపై నుంచి వెళ్తున్న హైటెన్షన్ వైర్లు ఒకదానికొకటి తగిలి షార్ట్ సర్క్యూట్ ఏర్పడడంతో అవి జీడితోటల్లో పడి మండలు చెలరేగాయి. దీంతో సమీపంలో ఉన్న కుద్ది హేమారావు, సాహుకారి యమున, దుర్గాప్రసాద్, ఎం.దానయ్య, సాహుకారి ప్రసాద్‌లకు చెందిన జీడి తోటలు ఒక్క సారిగా అంటుకున్నాయి. జీడి పంట చేతికొచ్చే సమయంలో ప్రమాదం జరగడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు లబోదిబోమంటున్నారు. సుమారు రెండు ఎకరాలు విస్తీర్ణంలో అగ్ని ప్రమాదం జరిగిందని ప్రభుత్వం నష్ట పరిహారం అందించాలని బాధితులు కోరుతున్నారు.